ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మల్లాపూర్: ఆరోగ్యంపై అమ్మాయిలు శ్రద్ధ వహించాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. నాచారంలో స్మైల్ విత్ షైన్ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అడల్స్ గర్ల్స్‌కు అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 60 మంది అమ్మాయిలకు శానిటరీ నాప్కిన్స్ కిట్లను అందజేశారు. స్మైల్ విత్ షైన్ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గ్రేస్, ప్రధాన కార్యదర్శి సత్యపాల్, కోశాధికారి శ్యాంసన్, మేరీ, శివమణి తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ రంగులతో చర్లపల్లి రైల్వే టెర్మినల్



కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్రివర్ణ లైటింగ్ ఏర్పాటు చేసి అలంకరించారు. ఈ లైటింగ్‌తో టెర్మినల్ సర్వాంగ సుందరంగా చూపరులను ఆకట్టుకుంటోంది. గురువారం రాత్రి త్రివర్ణ రంగులతో మెరిసిపోతూ అందరినీ కట్టిపడేసింది.

విద్యుత్ సబ్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

బోడుప్పల్: వర్షాల పట్ల విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ అన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ సబ్‌స్టేషన్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండి వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. 24 గంటలు వినియోగదారులకు ఫోన్‌లో అందుబాటులో ఉండాలని, స్థానికులు ఫోన్‌చేస్తే వెంటనే స్పందించాలన్నారు. హబ్సిగూడ ఎస్ఈ ప్రతిమ సోమ్, డీఈలు సుబ్బారావు, లింగయ్య, రమేష్, బోడుప్పల్ ఏఈలు వినయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ సాధ్యమేనా ?

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన చెట్ల కొమ్మలు

ప్రమాదాలతో భయాందోళన చెందుతున్న ప్రజలు | పట్టించుకోని సంబంధిత అధికారులు



మిర్జాల్‌గూడ రాజాశ్రీనివాసనగర్ బస్తీ దవాఖానాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మిర్జాల్‌గూడ, జ్యోతినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఏపుగా చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ వైర్లకు తీగలు అల్లుకుని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా కాలనీల ప్రజలు బయందోళ చెందుతున్నారు. వర్షాకాలం కాబట్టి భారీగా వర్షాలు పడిన వరదనీరు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా అయ్యే వైర్లు కిందికి వేలాడుతూ.. ఉండటంతో షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉండి ఎత్తు తక్కువ ఉండటంతో పాటు చుట్టూ కంచెలేకపోవడంతో ఎప్పడు.. ? ఏ ప్రమాదం జరుగుతందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ జ్యోతినగర్, మల్లికార్జుననగర్ సెవన్‌హిల్స్ స్కూల్ రోడ్డు, మిర్జాల్‌గూడ ప్రధానరోడ్డు, రాజా శ్రీనివాసనగర్ బస్తీ దవాఖానా పక్కన, ఏకలవ్యనగర్, గౌతంనగర్, ఇందిరా నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, ఎత్తు తక్కువగా ఉండి కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో జరిగిన ప్రమాదాలు..

మల్కాజిగిరి సర్కిల్‌లోని మౌలాలి డివిజన్ మారుతీనగర్‌లో చిన్నారి విద్యుదాఘాతానికి గురైన సంగతి తెలిసిందే. గత రెండు నెలల క్రితం మధుసూదన్‌నగర్‌లోని జైన్ మందిరం వద్ద విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది.

◆ ఇందిరానెహ్రూనగర్‌లో భవనం సమీపంలో ఉన్న విద్యుత్ వైర్ల కారణంగా ఓ మహిళా కార్మికురాలు షాక్‌కు గురై మృతి చెందింది. ఆమె భర్తకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయాలి...



ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కల పెరగడంతో పాటు ఎత్తు తక్కువగా ఉండి కంచె లేకుండా ఉన్నాయి. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదాలు.. జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– శ్రీనివాసన్, మల్లికార్జుననగర్

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి



డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం కాబట్టి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– మాశెట్టి అనిల్‌గుప్తా

స్వాతంత్ర్య దినోత్సవానికి నకాష్‌కు ఆహ్వానం

బోడుప్పల్: సాయిరాంనగర్‌కు చెందిన వైకుంఠం నకాష్‌కు ఆగస్టు 15న రాజ్‌భవన్ లాన్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు జరిగే తేనీటి విందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా బోడుప్పల్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ.. గ్రామీణ, సాంస్కృతిక ఇతి వృత్తాలను తెలిపే చేర్యాల నకాషి పెయింటింగ్స్ వేస్తున్నామన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు అవార్డులు అందుకున్నట్లు వివరించారు. ఇటీవల జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ తమ పేరును ప్రస్తావించినట్లు వెల్లడించారు. అంతరించి పోతున్న కళలకు మరలా జీవం పోస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



గౌతంనగర్: డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బబ్లూ, శ్రీనివాస్‌చారి, కుమార్, బాలు, సాయి, భాస్కర్ పంతులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటేందుకు తిరంగా ర్యాలీ

గౌతంనగర్: హర్ ఘర్ తిరంగా లో భాగంగా గురువారం బీజేపీ నేతలు గౌతంనగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి జాతీయ జెండాలు అందజేశారు. మాశెట్టి అనిల్, గోపీ, రాకేష్, ప్రకాష్, శశాంక్, సత్య తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో..

ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్‌సీసీ సంయుక్తాధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీ ఉప్పల్ చౌరస్తా వరకు చేరి తిరిగి కళాశాలకు చేరుకుంది.



ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద తిరంగా ర్యాలీతో విద్యార్థులు

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్‌లో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కిరణ్‌ముదిరాజ్‌ల నేతృత్వంలో జరిగిన తిరంగా ర్యాలీలో పార్లమెంట్ కన్వీనర్ అర్కె శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంతోషిమా చౌరస్తా నుంచి వినాయకనగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ శ్రేణులు, డివిజన్ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై..

రామంతాపూర్ : 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ పిలుపు మేరకు గురువారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా యాత్రకు రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, తిరుపతయ్య, లింగం, సుధా తదితరులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో బీజేపీ నేతలు



వెంకటాపురంలో..

అల్వాల్: వెంకటాపురం డివిజన్ ఇంద్రానగర్‌లో బీజేపీ నేతలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు గోగురి శ్రీధర్‌రెడ్డి, నాయకులు దేవేందర్, మహేందర్‌రెడ్డి, అభిషేక్, మురళీకృష్ణ, శివనాయుడు, మహేంద్రపాల్‌సింగ్, నరేంద్రబాబు, ఆంజనేయులు, రాజ్‌కుమార్, తిలక్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



వినాయక్‌నగర్‌లో..



గౌతంనగర్‌లో జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ ఆదేశాల మేరకు గురువారం 17వ డివిజన్ పరిధిలోని గెలాక్సీ హోమ్స్‌లో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోడుప్పల్‌ను హరితవనంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిద్దామని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈ రాకేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, భార్గవి కాలనీవాసులు పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రామంతాపూర్ : మూసీ పరీవాహక ప్రాంతంలో వరద పరిస్థితిని రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి గిరిబాబు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు పర్యటించి పరిశీలించారు. వారు గురువారం స్థానికులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ నేతలు మురళీగౌడ్, బిక్షపతిచారి, ప్రవీణ్, ఖాసీంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని వ్యాయామశాల ఆవరణలో ప్రతిమ సాయి బ్లడ్‌సెంటర్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించనున్నారు. ఆగస్టు 15 సందర్భంగా నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. యువకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మహిళ అదృశ్యం



బద్రమ్మ

మేడిపల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమలానగర్‌లో నివాసం ఉంటున్న కన్నా సౌజన్య భర్త, కుమారుడితో నివాసం ఉంటోంది. తన కుమారుడిని చూసుకోవడానికి తన తల్లి బద్రమ్మ(45)ను ఊరి నుంచి పిలిపించి తన వద్దే ఉంచుకుంటోంది. కాగా తల్లి కొద్ది నెలల నుంచి టిఫిన్ సెంటర్లలో పనిచేసుకుంటూ.. తన బిడ్డ వద్దే ఉంటోంది. 9న సొంతూరికి వెళ్లి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు తిరిగి ఇంటికొచ్చిన ఆమెకు తల్లి కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాలపై మాన్సూన్ టీమ్‌తో సమీక్ష

కుషాయిగూడ: బారీ వర్షాల నేపథ్యంలో మాన్సూన్ టీం సభ్యులతో పాటుగా అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె మాన్‌సూన్ టీమ్‌తో కుషాయిగూడ వార్డు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చర్లపల్లి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కుషాయిగూడ కూరగాయాల మార్కెట్‌ను కార్పొరేటర్ సందర్శించారు. పైకప్పు పెచ్చులూడుతున్న పరిస్థితులను ఆమె పరిశీలించారు. మార్కెట్ అభివృద్ధికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించేలా చూస్తానని వ్యాపారులు, కొనుగోలుదారులకు హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి తదితరులున్నారు.



మాన్సూన్ టీమ్‌కు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

బహుజన అమరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్‌పై బహుజన కులాల అమరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జకియా సుల్తానాకు పూలపల్లి సుందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బహుజన కులాల చైతన్య వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం ఆమెను కలిసిన అనంతరం వారు మాట్లాడుతూ.. జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రావు, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్నగౌడ్, బెల్లి లలిత, కొమరంభీమ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, శ్రీకాంత్‌చారి, జయశంకర్, కానిస్టేబుల్ కిష్టయ్య, పండుగ సాయన్న లాంటి స్వాతంత్ర్య సమరయోధులు, పోరాటయోధుల గురించి భావితరాల వారికి తెలియాల్సిన అవసరం ఉందని, ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరామన్నారు. పీసీయాదవ్ కరణంగోపి, చంద్రశేఖర్, రమేష్‌గౌడ్, రాజు, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.